క్లుప్తంగా

ఘనంగా ప్రపంచ జానపద దినోత్సవం

జంగారెడ్డిగూడెం: ప్రపంచ జానపద దినోత్సవాన్ని జానపద కళాకారులు శుక్రవారం జంగారెడ్డిగూడెంలో ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ఆర్ కృష్ణబాబు ఆధ్వర్యంలో జానపద ప్రదర్శనలు నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహం, భగత్‌సింగ్ సెంటర్, బోసుబొమ్మ సెంటర్, హెడ్ పోస్టాఫీస్ తదితర ప్రాంతాల్లో ప్రదర్శనలు నిర్వహించినట్టు కృష్ణబాబు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పట్టణంలోని పలు పార్టీల నాయకులు, సామాజిక వేత్తలు, ప్రజలు పాల్గొన్నారు. జానపద కళాకారులను సత్కరించారు.

యువతను డ్రగ్స్ నుంచి కాపాడండి

జంగారెడ్డిగూడెం: జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలని, యువతరాన్ని కాపాడాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్య కిరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. జిల్లా కమిటీ సభ్యులు ఉదయ్, పి.పోతురాజు, డి.నాగరాజు పాల్గొన్నారు.

నిందితుల ఆరోగ్యంపై ఆరా

చింతలపూడి : స్థానిక సబ్ జైల్‌లో నిందితుల కేసు వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, మంచినీటి సౌకర్యాలపై మండల న్యాయ సేవ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధు బాబు ఆరా తీశారు. శుక్రవారం ఆయన స్థానిక సబ్ జైల్‌ను సందర్శించారు. అనారోగ్యంగా ఉన్నవారికి అందించే వైద్య సదుపాయాలను ముద్దాయిలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఉపకారాగార పర్యవేక్షణాధికారి కృపానందం, జైలు సిబ్బంది, ప్యానల్ లాయర్ జి.విజయరావు, పీఎల్‌వీబీ నాగార్జున సాగర్ పాల్గొన్నారు.

శాకంబరిగా నూకాలమ్మ



నూకాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. పోలుపర్తి దాలమ్మ, కుటుంబసభ్యులు ఆలయ అభివృద్ధికి రూ.50,116 అందజేశారని ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. విజయదుర్గమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు, శ్రీ చక్ర అభిషేకాలు నిర్వహించారు. ముత్యాలమ్మ ఆలయంలో లఘున్యాస పూర్వక పంచామృత ఏకవార రుద్రాభిషేకాలు చేశారు. గుర్వాయిగూడెం జ్ఞాన సరస్వతి ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు.

కాచకంకణాలంకరణతో కనకదుర్గమ్మ



కనకదుర్గమ్మ

కొయ్యలగూడెం: కాచ కంకణాలంకరణతో (మట్టి గాజులు) వై.జంక్షన్ ఆలయంలో కనకదుర్గమ్మ శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చింది. మహిళలు లలితా సహస్రనామ పారాయణ చేశారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మధ్యాహ్నపు యేసు భక్తులతో కలిసి పూజలు, ప్రసాద వితరణ చేశారు. కొయ్యలగూడెం, బయ్యన్నగూడెం, కన్నాపురం, గవరవరంలోని కనకదుర్గమ్మ ఆలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. త్రిశక్తి పీఠంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో విశేష పూజలు చేశారు.

పునరావాస గ్రామంలో అన్నీ సమస్యలే

కుక్కునూరు: పునరావాస కాలనీలో ఆశ్రయం పొందుతున్న బాధితులకు కూరగాయలు ఇవ్వడం తప్ప ప్రభుత్వం చేసిందేమీ లేదని సీపీఐ ఎం ఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి షేక్ గౌస్ విమర్శించారు. శుక్రవారం సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు కుక్కునూరు మండలంలోని దాచారం ఆర్అండ్ఆర్ కాలనీలో ఆశ్రయం పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను గౌస్ కోరారు. నాయకులు కంగాల కల్లయ్య, ఎస్‌కే మున్ని, సున్నం భీమరాజు, మచ్చా లక్ష్మయ్య పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఆటవిడుపు ఉండాలి

ద్వారకాతిరుమల: నిత్యం వార్తల సేకరణలో ఉండే జర్నలిస్టులు మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలంటే ఆటవిడుపు ఉండాలని, అదే లక్ష్యంతో జర్నలిస్టుల స్పోర్ట్స్ అసోసియేషన్ (జేశాప్) పని చేస్తోందని అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌చార్జి పి.రవి కుమార్ అన్నారు. ద్వారకాతిరుమలలోని ఒక అతిథి గృహంలో శుక్రవారం నిర్వహించిన జేశాప్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మహాసభలో రవి కుమార్ మాట్లాడారు. ఈ సందర్భంగా జేశాప్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడిగా బంకా వెంకట తారక రామారావు, ప్రధాన కార్యదర్శిగా బొండాడ నాగబాబు, కోశాధికారిగా కమ్మ నాగేంద్ర కుమార్‌లను ఎన్నుకున్నారు. జేశాప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ రామకృష్ణరాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మొడియం ప్రసాద్, సునీల్, రాంబాబు, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

మోసం చేయడం బాబు నైజం



ప్రగడవరంలో క్యూ ఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న నాయకులు



శెట్టివారిగూడెంలో క్యూ ఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు జానకిరెడ్డి

చింతలపూడి : ప్రజలను మోసగించటం ముఖ్యమంత్రి చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు జగ్గవరపు జానకిరెడ్డి ఆరోపించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఎస్ రమేష్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం ప్రగడవరంలో పార్టీ గ్రామ విస్తృతస్థాయి సమావేశం, బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. జానకిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఇంతవరకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. సంపద సృష్టించి పథకాలు అమలు చేస్తానని చెప్పిన చంద్రబాబు మరి సంపద సృష్టిపై ఎందుకు దృష్టి సారించడం లేదని ప్రశ్నించారు. ఆడబిడ్డ నిధి పథకాన్ని ఎత్తేయడానికి కూటమి నాయకులు ఇప్పుడు నిధులు ఎక్కడి నుంచి వస్తాయని ప్రశ్నిస్తున్నారని ఆరోపించారు. దీంతో ఆడబిడ్డ నిధి పథకం ఇవ్వలేమని కూటమి నాయకులే ఒప్పుకున్నట్టు ఉందని తెలిపారు. సూపర్ సిక్స్ పేరుతో చంద్రబాబు రాష్ట్ర ప్రజలను వంచనకు గురి చేశారని ఆరోపించారు. సమావేశంలో హామీల క్యూ ఆర్ కోడ్‌ను విడుదల చేశారు.

హామీల అమలులో విఫలం

హామీలను నేరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు ఎస్ రమేష్ రెడ్డి ఆరోపించారు. చింతలపూడి మండలం శెట్టివారిగూడెంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గ్రామ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. బాబు అంటేనే మోసం, జగన్ అంటే నమ్మకం అని ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎన్నికల హామీల క్యూ ఆర్ కోడ్‌ను విడుదల చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ బి.రాంబాబు నాయక్, సర్పంచ్‌లు టి.భూపతి, కుమారి, సాయికుమారి, యూత్ ప్రెసిడెంట్ సురేష్, గ్రీవెన్స్ సెల్ దాస్, తాళ్లూరి రామకష్టారెడ్డి, ముక్కాల రామ్మోహన్ రెడ్డి, గంగాధర్‌రెడ్డి, చిట్టిబాబు, ఎర్ర శీనన్న, ఎంపీటీసీ నాగలక్ష్మీ రమేష్, వార్డు మెంబర్ ధర్మారావు, టి.సురేష్, యువ నాయకులు శేఖర్, శ్రావణ్, సతీష్, మాజీ జెడ్పీటీసీ సీహెచ్ ఖాదర్ బాబు, ఎంపీటీసీ నాగేశ్వరరావు, దారా అప్పారావు, వి.వెంకన్న, ఎస్ కిరణ్, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ధర్నా

జంగారెడ్డిగూడెం: మండలంలోని పంగిడిగూడెం గ్రామంలో అర్హులైన పేదలందరికీ మూడు సెంట్లు చొప్పున ఇల్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పంగిడిగూడెం గ్రామ సచివాలయం వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎం జీవరత్నం మాట్లాడుతూ గ్రామంలో 90 కుటుంబాల పేదలు ఇళ్ల స్థలాలు లేక అద్దె ఇళ్లల్లో ఉంటూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రెండు మూడు కుటుంబాలు ఒకే ఇంట్లో ఉండాల్సి పరిస్థితులు ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఎం.సురేష్, కె.సుబ్బారావు, జి.బాలయ్య, పి.బజార్, పి.ఘటోత్కచుడు, జి.మరియమ్మ, సింహాద్రి, నాగమణి, కె.శాంత కుమారి, జి.మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

కాగడాల ర్యాలీ

జంగారెడ్డిగూడెం: పట్టణంలో శుక్రవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓట్ చోర్ – గద్దే చోడ్ కాగడాల ర్యాలీ నిర్వహించారు. స్థానిక బోసుబొమ్మ సెంటర్ నుంచి కొత్త బస్టాండ్ వరకు కాగడాలు చేతబట్టి ఓట్ల చోరీ దొంగలు గద్దె దిగండి అంటూ నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతు సత్యేంద్రబాబు, కాశి, మద్దాల ప్రసాద్, రాజారత్నం మాట్లాడారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



జంగారెడ్డిగూడెం : విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం



కామవరపుకోట : మెడల్స్, ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని శ్రీనివాసపురం జెడ్పీ హైస్కూల్‌లో టాటా కంపెనీ ఆధ్వర్యంలో 'స్వీయ ఆధారిత భారతదేశాన్ని నిర్మించేందుకు నేను చేసే ఐదు పనులు' అనే అంశంపై విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించామని తెలుగు ఉపాధ్యాయులు బి.నాగేశ్వరరావు తెలిపారు. 180 మంది విద్యార్థులు పాల్గొన్నారని, విజేతలు త్వరలో రాష్ట్రస్థాయిలో నిర్వహించే వ్యాసరచన పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. సీనియర్ విభాగంలో మహాదేవి లాస్యశ్రీ, కుర్రు భవాని, తాడిగడప సింధు, జూనియర్ విభాగంలో కుందవరపు రేష్మి, శ్రీ నాగవల్లి సాయి, తగరం అఖిల, కప్పల శ్వేతలకు గోల్డ్, సిల్వర్, బ్రాంచ్ మెడల్స్, ప్రశంసాపత్రాలు అందించామని వివరించారు. కార్యక్రమంలో టాటా కంపెనీ ప్రతినిధి లింగాల రామాంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రావికంపాడులో..

కామవరపుకోట: మండలంలో రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టాటా బిల్డింగ్ ఇండియా కంపెనీ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించామని హెచ్ఎం ఉమ్మడి భీమరాజు శుక్రవారం తెలిపారు. సీనియర్ విభాగంలో మాన్యం మీనాక్షి, షేక్ రెహ్మాన్ జోనుబోయిన యామిని, జూనియర్స్ విభాగంలో మాన్యం వర్షిణి, వీరవల్లి సులోచన, షేక్ రిజ్వాన్, కన్సోలేషన్ ప్రైజ్ మారిశెట్టి ద్రాక్ష శివరాణిలు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌తో పాటు ప్రశంస పత్రం అందజేశారని పేర్కొన్నారు.

వర్షాకాలంలో పశువుల ఆరోగ్యం జాగ్రత్త



యర్రంపేటలో ఆవుకు టీకా వేస్తున్న డాక్టర్ అపురూప

కొయ్యలగూడెం: వర్షాకాలంలో పశువుల ఆరోగ్యానికి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని యర్రంపేట వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పి.అపురూప సూచించారు. యర్రంపేటలో ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు వచ్చే గొంతు వాపు, జబ్బ వాపు, పొదుగు వాపుల నివారణకు టీకాలు వేయించాలని, పశువుల పాకల్లో బ్లీచింగ్ పౌడర్, ఇసుక, ముగ్గు కలిపిన మిశ్రమాన్ని, కలరా ఉండలు కలిపిన ద్రావకాన్ని చల్లాలని సూచించారు. పాకల వద్ద మెస్, దోమ తెరలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. జూన్ నెల నుంచి ఫిబ్రవరి నెల వరకు పశువులు ఎదకు వచ్చే సమయమని, వాటిని సకాలంలో గుర్తించి గర్భధారణకు చర్యలు తీసుకోవాలి అన్నారు. పశువులు ఈనిన తర్వాత దూడలకు వ్యాధులు సంక్రమించకుండా టీకాలు వేయించాలని అన్నారు. పశువులకు పచ్చిరొట్ట, పచ్చి ఎండు గడ్డి సమాన స్థాయిలో కలిపి సమీకృత దాణా ఇస్తుండాలని అన్నారు. బాహ్య పరాన్న జీవుల నుంచి రక్షణకు భూటాక్స్ మందు నాలుగు నుంచి ఐదు మిల్లీలీటర్ల మందులు లీటర్ నీటిలో కలిపి పశువులు ఉండే పరిసర ప్రాంతాలు, పశువులపై 10 రోజులకు ఒకమారు చల్లుతూ ఉండాలని సూచించారు. వ్యాధి బారిన పడిన అనుమానం కలిగితే మిగిలిన పశువుల నుంచి దానిని దూరంగా ఉంచి, పశువైద్యుల్ని సంప్రదించాలన్నారు. విద్యుత్తు పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పశువులను కట్టకూడదని రైతులు, పశుపోషకులకు అపురూప సూచించారు.

ఆహార ఉత్పత్తుల పంపిణీ



ముద్దప్పగూడెంలో ఆహార ఉత్పత్తులను పంపిణీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని ముద్దప్పగూడెంలో శుక్రవారం ఏపీ సీఎంఎఫ్ వింగ్ ఆధ్వర్యంలో ఆరోగ్య, పోషణ కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలనే ఉద్దేశంతో ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఉత్పత్తులను గ్రామంలో ఉన్న గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల కుటుంబాలకు, వృద్ధులకు, నిరుపేదలు, నిరుద్యోగులకు ఫుడ్ బాస్కెట్ కార్యక్రమం అమలు చేస్తున్నారు. ఈ గ్రామంలో ఉన్న 81 కుటుంబాలకు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఒక బాస్కెట్ చొప్పున ధాన్యాలు, పప్పు, బెల్లం, తదితర వస్తువులను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంజా దుర్గమ్మ, ఐటీడీఏ ఎస్ఎఫ్ఏ హుస్సేన్, మార్కెటింగ్ ఎస్ఎఫ్ఏ పద్మనాభం, డివిజన్ ఎంటీ వెంకటేష్, అగ్రికల్చర్ వీఏ మధు, హెచ్ఎన్ ఎస్ఎఫ్ఎఫ్ ఎస్ గౌతమి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

జంగారెడ్డిగూడెం: పట్టణంలో నెలకొన్న పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక బీజేపీ నేతలు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కేవీ రమణకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో మాంసం విక్రయ కేంద్రాలన్నీ ఒకే చోట ఉండేలా, డైలీ మార్కెట్‌లో ఏర్పడే చెత్తను వారానికి రెండు సార్లు బయటకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నేతలు ఎం సీతారామారావు, ఎ.మురళి తదితరులు పాల్గొన్నారు.

బయ్యనగూడెంలో డ్రైడే ఫ్రైడే



బయ్యన్నగూడెంలో డ్రైడే ఫ్రైడే ర్యాలీ

కొయ్యలగూడెం: బయ్యనగూడెం ఎస్సీ ఏరియాలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది దోమల నివారణకు ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమ కాటు వల్ల డెంగీ, మలేరియా, చికున్ గున్యా వ్యాధులు వస్తాయన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని, వాడి పడేసిన కొబ్బరి బొండాలు, పగిలిన పాత కుండలు, ప్లాస్టిక్ సీసాలు, డిస్పోజబుల్ గ్లాసులు, పాత టైర్లు తొలగించుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం నీటి తొట్టిలను కడిగి పొడిగా ఉంచుకోవాలని, తొట్టిలపై మూతలు వేసుకోవాలని, ఫ్రిజ్ వెనుకాల ఉన్న నీటిని తొలగించడం ద్వారా దోమలు పెరగవని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఎం రవితేజ, హెల్త్ అసిస్టెంట్ మోహన్, సుబ్బారావు, ఏఎన్ఎంలు డి.రాట్నాలమ్మ, ఎం వనిత జ్యోతి, ఆశాలు శాంతకుమారి, జగతి పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు

కామవరపుకోట: స్థానిక కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025 – 2026 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని ప్రిన్సిపాల్ కె.విజయబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఏ పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ జువాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 26 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, 24 నుంచి 28వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ నమోదు, ఆగస్టు 31న సీట్ల కేటాయింపు ఉంటుందని, సెప్టెంబర్ 1 నుంచి తరగతుల ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. విద్యార్థినులకు కళాశాల ప్రాంగణంలోనే ఉచితంగా హాస్టల్ సదుపాయం ఉంటుందని, ఎన్ఎస్ఎస్ విభాగం, మహిళా సాధికారత విభాగం, స్టడీ అవర్స్, డిజిటల్ క్లాస్ రూమ్, గ్రంథాలయం సదుపాయం ఉందని వివరించారు. విద్యార్థులకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి కళాశాలలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడుతున్నట్టు తెలిపారు.

దాడి ఘటనపై కేసు నమోదు

ద్వారకాతిరుమల: ఆస్తుల విషయంలో ఒక వ్యక్తిపై జరిగిన దాడికి సంబంధించి పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాల ప్రకారం.. భీమడోలు మండలం పూళ్ల గ్రామానికి చెందిన నిట్టా మోహన్‌రావు మండలంలోని సీహెచ్ పోతేపల్లిలో ఉన్న తన అక్కను చూసేందుకు ఈనెల 16న వెళ్లాడు. అదేరోజు మోహన్‌రావును తన తమ్ముడి భార్య ఇంటికి పిలిచి, మద్యం తాగించారు. అనంతరం ఆస్తుల విషయంలో మోహన్‌రావుతో జరిగిన గొడవలో నిట్టా శివకృష్ణ అనే వ్యక్తి మోహన్‌రావును ఇనుప రాడ్డుతో చెవిపై కొట్టాడు. తీవ్రంగా గాయపడ్డ మోహన్‌రావును స్థానికులు తొలుత పీహెచ్‌సీకి, అక్కడి నుంచి ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి, అనంతరం విజయవాడ జీజీహెచ్‌కు తరలించి, చికిత్స అందిస్తున్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం: స్విచ్‌ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాలిపేట, జేపీ సెంటర్, త్రివేణి ఏరియా పరిధిలోని విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అక్కంపేట, మర్లగూడెం ఏజీఎల్ సర్వీసులు, లైటింగ్ సర్వీసులకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

- చింతలపూడి: యర్రంపల్లి ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, నామవరం ఫీడర్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, యర్రగుంటపల్లి ఏజీఎల్ ఫీడర్, యండపల్లి ఫీడర్‌లలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ అహ్మద్‌ఖాన్ తెలిపారు.
- బుట్టాయగూడెం: మండలంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ అహ్మద్‌ఖాన్ తెలిపారు. జంగారెడ్డిగూడెం నుంచి వచ్చే 33 కేవీ బుట్టాయగూడెం సబ్ ప్లాన్ నిలుపుదల చేస్తామని, బుట్టాయగూడెం, రామారావుపేట సెంటర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న అగ్రికల్చర్ 3 ఫేస్ సప్లై కూడా ఉండదని వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొయ్యలగూడెం: మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందినట్టు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. కొయ్యలగూడెంకు చెందిన పనసకాయల నాగేశ్వరరావు (53), అతని భార్యకు డబ్బుల విషయంలో గొడవలు ఉన్నాయి. 6 నెలల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మానసికంగా బాధపడుతున్న నాగేశ్వరరావు ఈనెల 21న ఎలుకల మందు తాగాడు. రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ నాగేశ్వరరావు మృతిచెందారు. నాగేశ్వరరావు తండ్రి పనసకాయల సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టారు.

శాంతిస్తున్న గోదావరి వరద



కుక్కునూరు : గ్రామం చుట్టూ ఉన్న వరద

కుక్కునూరు: రెండు రోజులుగా ఉధృతంగా ప్రవహించిన గోదావరి శుక్రవారం కాస్త శాంతించింది. దీంతో కుక్కునూరు మండల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గోదావరి వరద భద్రాచలం వద్ద వేగంగా తగ్గుముఖం పట్టింది. ఐనా కుక్కునూరు గ్రామ శివారు ప్రాంతాల్లోని పంటచేలు ముంపులోనే ఉన్నాయి. ప్రభుత్వం కాంటూర్‌లతో సంబంధం లేకుండా ఆర్అండ్ఆర్ పరిహారాన్ని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

పశుదాణా సరఫరా చేయాలి

గోదావరి వరద కుక్కునూరులోని పంట చేలను, గోదావరి ఒడ్డున ఉన్న ఖాళీ ప్రదేశాలను ముంచెత్తడంతో గత మూడు, నాలుగు రోజులుగా మేతలేక ఆవులు, గేదెలు అల్లాడిపోతున్నాయి. పంట పొలాలను వరద ముంచెత్తడంతో మూగజీవాలకు పచ్చిగడ్డి కరువైంది. పాడి రైతులు వరిగడ్డితోనే గేదెలను మేపుకొంటున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో గోదావరి వరద ఉధృతంగా వచ్చి గ్రామాలను ముంచెత్తినప్పుడు పాడిరైతులకు ఉచితంగా దాణా సరఫరా చేశారని వారు గుర్తుచేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి పశువులకు దాణా సరఫరా చేసి పాడిరైతులను ఆదుకోవాలని పశువుల యజమానులు కోరుతున్నారు.

వరద బాధితులకు వితరణ



వేలేరుపాడు : నిత్యావసరాలు అందిస్తున్న దృశ్యం

వేలేరుపాడు: వేలేరుపాడు మండలంలోని వరద బాధిత కుటుంబాలకు అధికారులు నిత్యావసర వస్తువులు, కూరగాయలను ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రాములు నాయక్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు ఉల్లిపాయలు 1150 కేజీలు, బంగాళదుంపలు 1195 కేజీలు, టమాటాలు 500 కేజీలు, పచ్చి మిరపకాయలు 250 కేజీలు అందించామని, వరద సహాయక కేంద్రాల వద్ద తాగునీరు, నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు చేపట్టామని నాయక్ తెలిపారు. వరద సహాయక కేంద్రాల వద్ద దోమల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు చెప్పారు.

ముంపులో వరి నాట్లు



పోలవరం రూరల్ : ముంపులోనే పొలాలు

పోలవరం రూరల్: గోదావరి వరద పెరుగుతుండటంతో వరద ఎగపోటు నీటితో పోలవరం ప్రాంతంలోని నాట్లు వేసిన చేలు ముంపునకు గురయ్యాయి. ఇటీవల నాట్లు వేసిన పొలాలు రెండు రోజులుగా గోదావరి నీటిలో మునిగిపోయాయి. వరద పూర్తిగా తగ్గి కడెమ్మ స్లూయిజ్ ద్వారా ఈ నీరంతా నదిలోకి చేరితే తప్ప పంట పొలాలు ముంపు నుంచి బయటపడే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు.

సత్యసాయి మంచినీటి కార్మికుల సమ్మె



కన్నాపురం అడ్డరోడ్డు వద్ద సమ్మె చేస్తున్న కార్మికులు

పోలవరం రూరల్: పోలవరం మండలం కన్నాపురం అడ్డరోడ్డులో సత్యసాయి మంచినీటి పథకం వద్ద కార్మికులు శుక్రవారం విధులు బహిష్కరించి, జీతాల కోసం సమ్మెలోకి దిగారు. మానవహారంగా ఏర్పడి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 9 నెలలుగా జీతాలు అందడంలేదని, అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. 17 మండలాల్లో సుమారు 6 లక్షల మందికి తాగునీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఉన్నతాధికారులకు సమ్మె నోటీసులు కూడా అందజేశామని కార్మికుల అధ్యక్షులు జి.శివసత్యనారాయణ చెప్పారు. జీతాలు ఇచ్చే వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు.

ట్యాంకర్లతో మంచినీటి సరఫరా



గూటాలలో ట్యాంక్ వద్ద నీరు పట్టుకుంటున్న ప్రజలు

పోలవరం రూరల్: మండలంలోని గూటాల పంచాయతీ పరిధిలో రక్షిత మంచినీటి పథకం మోటార్లు మరమ్మతులకు గురికావడంతో ప్రజలకు నీరు అందని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి శుక్రవారం మూడు వాటర్ ట్యాంక్‌ల ద్వారా పంచాయతీ పరిధిలోని వీధుల్లో నీరు సరఫరా చేశారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.